

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

19వ వసంతంలోకి ...

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
పోలవరం(రంపచోడవరం)జిల్లా

మంగళవారం,17 మార్చి 2026 | 8 పేజీలు










# కాకినాడ రైల్వేపై 'చూపు'లేని కేంద్రం !


నిన్నటి 'పెన్షనర్స్ ప్యారడైజ్' నేడు గ్లోబల్ హబ్‌గా రూపాంతరం చెందింది! అప్పటికి ఇప్పటికీ నగరం రూపురేఖలే మారిపోయాయి. అక్షరాస్యతలో అగ్రగామిగా నిలుస్తూ'దక్షిణ భారత ఆక్స్‌ఫర్డ్'గా పేరొందిన విద్యా సంస్థలు ఒకవైపు..సముద్ర గర్భం నుండి నల్ల బంగారాన్ని వెలికితీసే కార్గో సంస్థలు, భారీ పారిశ్రామిక వాడలు మరోవైపు.. నేడు కాకినాడ నగరం ఒక ఆర్థిక ఇంజిన్‌లా దూసుకుపోతోంది.అత్యాధునిక మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్, ఆకాశాన్నంటే షాపింగ్ మాల్స్,కిటకిటలాడే జనారణ్యం.. ఇలాప్రతిరంగంలోనూ కాకినాడ 'గ్రీన్ లిస్టు'లో అగ్రస్థానంలో నిలుస్తోంది. కానీ, ఇంతటి మహానగరానికి ప్రాణవాయువు లాంటి రైల్వే అనుసంధానత మాత్రం నేటికీ మూడు దశాబ్దాల వెనుకబడిన స్థితిలోనే ఉండిపోవడం విచారకరం.ఒకప్పుడు లక్షల్లో ఉన్న జనాభా నేడు మిలియన్లకు చేరింది. నగర విస్తీర్ణం పెరిగింది, ఆదాయం పెరిగింది, కానీ రైల్వే ట్రాకులు మాత్రం పెరగలేదు. పుష్కరాల ముంగిట నిలబడ్డ ఈ స్మార్ట్ సిటీకి, ఒక ప్రధాన రైల్వే టెర్మినస్ లేకపోవడం అధికారుల అసమర్థతకు నిలువుటద్దం. అభివృద్ధిలో గ్రీన్ సిగ్నల్ చూపిస్తున్న కాకినాడకు, రైల్వే శాఖ ఎప్పుడు గ్రీన్ సిగ్నల్ ఇస్తుందో వేచి చూడాలి. దీనిపై ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో కొమ్మన సతీష్ అందించిన క్షేత్రస్థాయిలో పరిశీలనాత్మక కథనం...

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**

- మూడు దశాబ్దాలుగా కాగితాలకే పరిమితమైన పిఠాపురం-కాకినాడ మెయిన్ లైన్
- పుష్కరాలు వస్తున్నా కదలని రైల్వే బోర్డు.. కోనసీమ ప్రయాణికులకు తప్పని అగచాట్లు
- పట్టాలెక్కని కాకినాడ ప్రగతి రథం!
- రాజ్యసభ ఎంపి సానా పైనే లక్షలాది నగర వాసుల ఆశలు!

ఆఫ్-షోర్ ఆయిల్ హబ్..రైస్‌బౌల్ ఆఫ్ ఆంధ్రా..విద్యా సంస్థల నిలయం.. ఇన్ని ప్రత్యేకతలున్న కాకినాడ నగరం రైల్వే మ్యాప్‌లో మాత్రం నేటికీ అనాథగానే కనిపిస్తోంది. మూడు దశాబ్దాల క్రితం మంజూరైన పిఠాపురం-కాకినాడ మెయిన్ లైన్ ప్రాజెక్టు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండటంరైల్వేఅధికారుల ఉదాసీనతకు పరాకాష్టగా మారింది. 2027 గోదావరి పుష్కరాలు సమీపిస్తున్న తరుణంలో, కోట్లాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నా, కాకినాడకు రైల్వే కనెక్టివిటీ కల్పించడంలో


- తరువాయి 2లో..



ప్రయాణికుల కష్టాలు కళ్ళకు కనపడవా!

# అభినవ భద్రాద్రి..

- గొల్లలమామిడాడలో సీతారాముల కల్యాణ వైభవం!
- వందలాది ఏళ్ల చరిత్ర..ఆధ్యాత్మిక పరిమళాల వేదిక.. లక్షలాదిగా తరలిరానున్న భక్తులు!



**కాకినాడ/పెదపూడి,మేజర్‌న్యూస్ :** ఆకాశాన్ని తాకే ఎత్తయిన గోపురాలు..అడుగిడగానే పులకింపజేసే ఆధ్యాత్మిక వాతావరణం.. చిరునవ్వుతో సాక్షాత్కరించే సీతారామచంద్రులు.. ఇది తూర్పుగోదావరి జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గొల్లల మామిడాడలోని శ్రీ కోదండరామస్వామి ఆలయదృశ్యం. 'చూసేందుకు రెండు కళ్ళు సరిపోవు' అన్న రీతిలో విరాజిల్లుతున్న ఈఆలయంలో ఈనెల 27న శ్రీరామనవమి పురస్కరించుకుని సీతారాముల కల్యాణ మహోత్సవానికి సర్వం సిద్ధమవుతోంది.

**అభినవ భద్రాద్రిగా ఖ్యాతి..**భద్రాచలం వెళ్లలేనివారు, ఒంటిమిట్ట దర్శించలేని భక్తులు నేరుగాగొల్లల మామిడాడ చేరుకుంటారు.అందుకే ఈ క్షేత్రానికి 'అభినవ భద్రాద్రి'అనే పేరు స్థిరపడిపోయింది. రాములవారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులుఒకరోజు ముందే ఇక్కడికి చేరుకోవడం ఇక్కడి విశిష్టతకు నిదర్శనం.

**అవివాహితులకు వరప్రదాయిని..**ఈ క్షేత్రానికి ఒక ప్రత్యేకమైన ప్రతీతి ఉంది. వివాహం కాని వారు ఇక్కడ జరిగేరాములవారి కల్యాణాన్ని భక్తితో తిలకిస్తే, వారికిత్వరలోనే వివాహ గడియలు కుదురుతాయని భక్తుల నమ్మకం.ఈకారణంతోనే రాష్ట్రవ్యాప్తంగా వేలాది మందియువతీయువకులు,వారి తల్లిదండ్రులు ఈ వేడుకకు తరలివస్తారు.

**లక్షలాదిమందికి అన్నప్రసాదం - ధర్మకర్త ఏర్పాట్లు..** ఈ ఏడాది దాదాపు లక్ష మందికి పైగా భక్తులు వస్తారనిఅంచనావేస్తున్నారు.

- తరువాయి 2లో..

## ఎల్పిజీ గోదామును తనిఖీ చేసిన

# జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్







**కాకినాడ,మేజర్‌న్యూస్ :** సోమవారం జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్..రెవెన్యూ,పౌరసరఫరాలశాఖ అధికారులతో కలిసి కాకినాడ పోర్టు పరిధిలో ఉన్న బీపీసీఎల్ బోటిలింగ్ ప్లాంట్, తిరుమల లాజిస్టిక్స్ తనిఖీ చేశారు. బులెట్ లోడ్స్‌ను వెంటనే రీఫిల్లింగ్ చేసి త్వరితగతినగ్యాస్ ఏజన్సీలకు సరఫరా చేయాలని ఈ సందర్భంగా జేసీ ఆదేసించారు.ఈ సందర్భంగా జేసీ అపూర్వ భరత్ మాట్లాడుతూ..కాకినాడ జిల్లాలో బీపీసీఎల్ బాటిలింగ్‌ప్లాంట్‌మాత్రమే ఉన్నదన్నారు. మిగిలిన హెచ్పీసీఎల్,ఐవోసీఎల్ కంపెనీలకు సంబంధించిన బాటిలింట్ ప్లాంట్లు విశాఖపట్నం, గుమ్మల్లదొడ్డిలో కలవని, ఎప్పటికప్పుడు సంబంధిత ప్లాంట్ మేనేజర్లు మరియు సేల్స్ ఆఫీసర్లుతో సమన్వయము చేసుకుని,అవసరమైన మేరకు డొమెస్టిక్ సిలండర్లను ప్రతిగ్యాస్‌ఏజన్సీకి అందుబాటులో ఉంచడం జరుగుతున్నదని ఆయన తెలిపారు. అనంతరం ఆయన కాకినాడ పట్టణంలో గల శ్రీ ఎజన్సిస్ (హెచ్పీసీఎల్) గ్యాస్ కంపెని గోడౌన్ ను ఆకస్మికంగా తనిఖి చేసినారు. ఈ సందర్భంగా స్టాకు నిల్వల పరిశీలించి, వివరాలుఆరా తీశారు. సాధారణ బుకింగులు కంటే ఎక్కువ బుకింగులు వచ్చాయని అవసరం ఉన్నవారికి మాత్రమే గ్యాస్‌వెంటనే సరఫరా చేయవలని జేసీ ఆదేశించారు. ప్రతిగ్యాస్ బాయ్‌ను నిరంతరం పర్యవేక్షణ చేయవలెనని, బిల్లు కంటే ఎక్కువ ధర తీసుకున్నట్లయితే వెంటనే వారిపై చర్య తీసుకొనవలన్నారు. ఏటువంటి ఫిర్యాదులు అందిన గ్యాస్ బాయ్‌పై క్రిమినల్‌చర్య, డీలరుకు నోటీసు జారీ చేయడం జరుగుతుందని

- తరువాయి 2లో..

# చివరి వరకు "చెక్కుచెదరని పిఠాపురం కౌన్సిల్"

– నేటితో ముగియనున్న పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్ కాలపరిమితి
– రాజకీయ వ్యూహాలకు అందని పిఠాపురం కౌన్సిల్




**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్ పదవీకాలం నేటితో ముగియనున్న నేపథ్యంలో... మున్సిపల్ కౌన్సిల్ పై పిఠాపురంలో ప్రత్యేక చర్చ నడుస్తుంది. 2021 మార్చి 17వ తేదీన పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్ కొలువుతీరింది. 2024 ఎన్నికల్లో కూటమి విజయం సాధించి రాష్ట్రంలో అధికార మార్పుల తర్వాత అనేక మున్సిపాలిటీల్లో రాజకీయ ప్రలోభాలు, ఒత్తిడులు, పదవుల హామీలతో ప్రతిపక్ష కౌన్సిలర్లను తమవైపు తిప్పుకొని పాలనాధికారాన్ని కైవసం చేసుకున్న ఉదాహరణలు కనిపించాయి. పిఠాపురంలో కూడా అదే జరుగుతుందని అందరూ ఊహించారు. అయితే పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్ మాత్రం ఈ రాజకీయ ప్రభావాలకు అందకుండా చివరి వరకు చెక్కుచెదరకుండా నిలిచింది. సాధారణంగా రాజకీయ నాయకులు పార్టీలు మారడం సర్వసాధారణమైన విషయం. ఇక్కడ వైఎస్ఆర్సిపి నుండి విజయం సాధించిన మెజారిటీ కౌన్సిలర్లు పార్టీ పట్ల తమ విధేయతను చాటుకున్నారు అనడంలో ఏమాత్రం సందేహం లేదు. పిఠాపురం మున్సిపల్ చైర్ పర్సన్ గండేపల్లి సూర్యావతి రామారావు (బాబి) రాజకీయ చతురత, పిఠాపురం నియోజకవర్గ వైసిపి ఇన్చార్జి వంగా గీత విశ్వనాథ్ వ్యూహాలు కౌన్సిల్ ను చివరి వరకు నిలిపాయని చెప్పవచ్చు. పిఠాపురంలో జనసేన ప్రభావం అధికంగా ఉంది అనడంలో ఏమాత్రం సందేహం లేదు. ఇక్కడ 2019 ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి నుండి ఎమ్మెల్యేగా గెలిచిన పెండెం దొరబాబు 2024 ఎన్నికల అనంతరం జనసేన పార్టీలో చేరారు. పెండెం దొరబాబు జనసేనలో చేరుతున్న సమయంలో ఆయన వెంట మెజారిటీ కౌన్సిలర్లు వెళతారని జోరుగా ప్రచారం సాగింది. కానీ క్షేత్రస్థాయిలో అదేమీ జరగలేదు. వైసిపి కి చెందిన ముగ్గురు కౌన్సిలర్లు, మరొక స్వతంత్ర కౌన్సిలర్ మాత్రమే ఆయన వెంట జనసేనలో చేరారు. కౌన్సిల్లో మెజారిటీ కలిగిన కౌన్సిలర్లు వివిధ దశల్లో వచ్చిన రాజకీయ ఆహ్వానాలు, ఒత్తిడులు, ప్రలోభాలను తిరస్కరించి తమ వైఖరిని మార్చుకోలేదని, ప్రజలు ఇచ్చిన తీర్పుకు కట్టుబడి పదవీ కాలం చివరి రోజు వరకు అదే పక్షాన కొనసాగడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఇతర పట్టణాల్లో చోటు చేసుకున్న రాజకీయ మార్పులకు విరుద్ధంగా, పిఠాపురంలో వైసిపి కౌన్సిలర్లు తమ వైఖరి మార్చకపోవడంతో... ఈ కౌన్సిల్‌ను "చెక్కుచెదరని కౌన్సిల్"గా అభివర్ణించవచ్చు. టిడిపి, జనసేన, బిజెపి మరియు ఇతర పార్టీ అయినా సరే... నాయకులు పార్టీలు మారినంత మాత్రాన పార్టీ కోసం కష్టపడి పని చేసే కార్యకర్తలు పార్టీ మారతారు అనుకుంటే అది పొరపాటే. ఈ విషయాన్ని పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్ కొనసాగిన తీరు చెప్పకనే చెప్పింది అనడంలో సందేహం లేదు.

# ఘనంగా అమరజీవి జయంతి వేడుకలు



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలు సోమవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ దృశ్యమాధ్యమ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. తొలుత పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కలెక్టర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ, జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్, కలెక్టరేట్ ఇతర శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగించిన అతిథులు మాట్లాడుతూ, భాషా రాష్ట్రం సాధన కోసం ఆత్మత్యాగం చేసిన మహోన్నత మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఆయన త్యాగాలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 125వ జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నదని తెలిపారు. ఈ సందర్భంగా అమరావతిలో 58 అడుగుల ఎత్తైన కాంస్య విగ్రహాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రహదారిపై సమస్యాత్మక (రెడ్ స్పాట్) జంక్షన్లను గుర్తించిన పోలీస్ ఉన్నతాధికారులు



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న జాతీయ రహదారిపై ప్రమాదకర ప్రదేశాలను ఎస్పై రామలింగేశ్వరరావు (ఏ ఆర్) అడిషనల్ ఎస్పీ,మరియు డి.ఎస్.పిలు పరిశీలించారు. ఏలేశ్వరం మండలం పేరవరం జంక్షన్, చిన్నింపేట జంక్షన్ వద్ద జాతీయ రహదారిని పరిశీలించారు. ఈ రెండు రహదారి ప్రాంతాలను సమస్యాత్మక ప్రాంతాలుగా పోలీసుల ఉన్నతాధికారులు గుర్తించారు.

# అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది

– పిఠాపురం బీజేపీ నాయకులు



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** తెలుగు జాతి ఆత్మగౌరవం కోసం, ప్రత్యేక రాష్ట్ర సాధనకై ప్రాణత్యాగం చేసిన మహాపురుషుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని భారతీయ జనతా పార్టీ పిఠాపురం పట్టణ ఉపాధ్యక్షులు గరగా వీరబాబు అన్నారు. సోమవారం పిఠాపురం పట్టణ శాఖ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి, ప్రాణాలను పణంగా పెట్టి తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రాన్ని అందించిన త్యాగధనుడని కొనియాడారు. పొట్టి శ్రీరాములు 125వ జయంతిని పురస్కరించుకుని, అమరావతిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 58 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించడం శుభపరిణామమని హర్షం వ్యక్తం చేశారు. ఇది భావితరాలకు ఆయన త్యాగాన్ని చాటిచెబుతుందని అన్నారు. తెలుగు జాతి ఉన్నంత వరకు ఆయన పేరు ప్రాతః స్మరణీయమని, ఆచంద్రతారార్కం అని ఆయన కీర్తి నిలిచిపోతుందని కొనియాడారు.? ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బుర్రి మురళీధర్ రావు, దాట్ల వెంకట సూర్యనారాయణ రాజు, పట్టణ జనరల్ సెక్రెటరీ కంబాల నాగేశ్వరావు, సెక్రటరీ వానపల్లి రమణ, పసుపులేటి సత్తిబాబు, అల్లుబోయిన సూరిబాబు, వీర మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

### కాకినాడ రైల్వేపై

# 'చూపు' లేని కేంద్రం!

మొదటిపేజి తరువాయి

కేంద్రం చూపుతున్న వివక్షపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ట్రంక్ రూట్ శాపం.. సామాన్యుడి కష్టం**

కాకినాడ నగరం ప్రధాన రైల్వే లైన్ ట్రంక్ రూట్ మీద లేకపోవడం ఇక్కడి ప్రయాణికులకు శాపంగామారింది. విశాఖపట్నం వైపు వెళ్లాలన్నా, విజయవాడ వెళ్లాలన్నా ప్రయాణికులు 100 కిలోమీటర్ల మేర బస్సుల్లో ప్రయాణించి సామర్లకోట లేదా రాజమహేంద్రవరం వెళ్ళాల్సి వస్తోంది. కోనసీమ జిల్లా నుంచి వచ్చే ప్రయాణికుల పరిస్థితి మరీ దారుణం. యానాం వంటి కేంద్రపాలిత ప్రాంతానికి ముఖద్వారమైన కాకినాడలో కనీసం పది రైళ్లు కూడా ఇక్కడి నుంచి ప్రారంభం కాకపోవడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**పిట్ లైన్ల పేరుతో కాలయాపన!**

కొత్త రైళ్లు ప్రారంభించాలంటే కాకినాడ పోర్ట్ స్టేషన్‌లో పిట్ లైన్లు అనగా రైళ్ల నిర్వహణ కేంద్రాలు లేవనే కుంటి సాకును అధికారులు ఏళ్లుగా చెబుతున్నారు. నిజానికి పిట్ లైన్ల నిర్మాణం కోసం నిధులు కేటాయించినా, అవిఎందుకు కార్యరూపం దాల్చడం లేదనేది ఇప్పుడు మిస్టరీగామారింది.పొరుగున ఉన్న విశాఖపట్నం, విజయవాడలో ముగిసే రైళ్లను కాకినాడ వరకు పొడిగిస్తే సాంకేతికంగా వచ్చే ఇబ్బందులేంటో అధికారులు స్పష్టం చేయడం లేదు.

**అసోసియేషన్ పోరాటం..**గోదావరి జిల్లాల రైల్వే ప్యాసింజర్స్ అసోసియేషన్ ఇప్పటికే ఈ అంశంపై కేంద్ర రైల్వే మంత్రికి, ప్రధానమంత్రి కార్యాలయానికి నివేదికలు పంపింది. రాజకీయ నాయకుల చిత్తశుద్ధి లేకపోవడం వల్లే ఈ ప్రాంతం వెనుకబడిందని అసోసియేషన్ అధ్యక్షుడు గట్టి సత్యనారాయణ, కార్యదర్శి డి.ఎన్. రమేష్ బాహాటంగానే విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా రైల్వే బోర్డు మేల్కొనకపోతే, 2027 పుష్కరాల సమయంలో కాకినాడ రవాణా వ్యవస్థ అతలాకుతలం కావడం ఖాయంగా కనిపిస్తోంది.

**పరిష్కార మార్గాలు ఇవే..**

**పిఠాపురం అనుసంధానం:** పిఠాపురం-కాకినాడ మధ్య ఉన్న 21 కిలోమీటర్ల మెయిన్ లైన్ పనులు పూర్తి చేస్తే కాకినాడ రూపురేఖలే మారిపోతాయి.

**రైళ్ల పొడిగింపు :** పినాకిని,శాతవాహన, రత్నాచల్ వంటి కీలక రైళ్లను కాకినాడ వరకు పొడిగించడం ద్వారా ప్రభుత్వానికి భారీ ఆదాయం సమకూరుతుంది.

**టెర్మినస్ అభివృద్ధి:** కాకినాడను ఒక పూర్తిస్థాయి టెర్మినస్‌గా మార్చి ఉత్తరాదికి అనగా వారణాసి, అయోధ్యలకు నేరుగా రైళ్లు నడపాలి.

# అభినవ భద్రాద్రి..

మొదటిపేజి తరువాయి

ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ద్వారంపూడి శ్రీరామమురళీకృష్ణ శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలోభారీఏర్పాట్లు జరుగుతున్నాయి.

**-ఉచిత దర్శనం & ప్రసాదం:** వచ్చిన ప్రతి భక్తుడికి ఉచితంగా భోజన సౌకర్యం, స్వామివారి ప్రసాదం పంపిణీ చేయనున్నారు.

**- వీవీఐపీల రాక:** జిల్లా కలెక్టర్, ఎస్పీ దంపతులతో పాటు ప్రజాప్రతినిధులు,ప్రముఖరాజకీయ నాయకు లుఈవేడుకలో పాల్గొననున్నారు.ఎలాంటి అసౌకర్యం కలగకుండా, పూర్తిఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులు స్వామిని దర్శించుకునేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ధర్మకర్త వెల్లడించారు. భక్తిభావంతో పులకించే ఈ కల్యాణ వేడుకకు గొల్లలమామిడాడ ముస్తాబవుతోంది.

## ఎల్పిజీ గోదామును తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్

మొదటిపేజి తరువాయి

జేసీ హెచ్చరించినారు.కాకినాడ జిల్లాలో వినియోగదారులు వారికి ఎటువంటి ఇబ్బందికి గురికాకుండా నిరంతరం గ్యాసు నిమిత్తం తగు సమాచారం అందించుటకు కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లాపౌర సరఫరాల సంస్థ కార్యాలయంలో ఫోన్ నెం. 8886903611తో కంట్రోల్ రూము ఏర్పాటు చేయడం జరిగిందని జేసీ తెలిపారు.ఈ పరిశీలనలో జాయింట్ కలెక్టర్ వెంటకాకినాడఆర్డీవో ఎస్.మల్లిబాబు, డీఎస్వో ఆర్ఎస్ఎన్.సత్యనారాయణ రాజు, కాకినాడ రూరల్ తహశీల్దార్ ఎస్.ఎల్.ఎన్. కుమారి, ఏఎస్ఓ ప్రసన్న లక్ష్మి దేవి, సీఎస్డీటీ టి.శ్రీనివాసరావు, ఇతర రెవెన్యు అధికారులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులు విధులకు గైర్హాజరు అయితే చర్యలు తప్పవు

**- కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఎటువంటి సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరు అయ్యే పారిశుద్ధ్య కార్మికులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ హెచ్చరించారు. సోమవారం ఉదయం 12వ సర్కిల్ పరిధిలోని గాంధీనగర్ బాల భవన్ సమీపంలో ఉన్న మస్తార్ కేంద్రాన్ని కమిషనర్ ఆకస్మాత్తుగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నలుగురు పారిశుద్ధ్య కార్మికులు విధులకు హాజరు కాకపోవడం గమనించిన కమిషనర్, వారికి నోటీసులు జారీ చేయాలని సంబంధిత శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర పరిశుభ్రతలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. ముఖ్యంగా నగరంలోని ప్రధాన రహదారులు ప్రతి రోజు తెల్లవారుజామునే శుభ్రం చేయాలని సూచించారు. ఎటువంటి సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరు అయ్యే కార్మికులపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు.కాకినాడ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలను ఆయన అభినందించారు. రాబోయే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో కాకినాడ నగరానికి మంచి ర్యాంకు రావాలంటే పారిశుద్ధ్య కార్మికుల కృషి ఎంతో అవసరమని పేర్కొన్నారు. తనిఖీ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సత్తిబాబు తదితరులు కమిషనర్ వెంట ఉన్నారు.

# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**- ముప్పా శ్రీనివాస్**

**ఎటపాక, మేజర్ న్యూస్ :** రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని, కూటమి ప్రభుత్వంలో ప్రతి ఒక్క రైతును రాజు ను చేయటమే లక్ష్యంగా పెట్టుకొని వారికి కావాల్సిన పరికరాలను అందిస్తుంది అని టీడీపీ సీనియర్ నాయకులు ముప్పా శ్రీనివాస్ అన్నారు. పోలవరం జిల్లా ఎటపాక మండలం మేడవాయి గ్రామంలో రైతన్న మీ కోసం వారోత్స వాల కార్యక్రమం సోమవారం అత్యంత ఉత్సాహంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వ ప్రతిష్టాత్మక సూపర్ సిక్స్ పథకం అన్నదాత సుఖీభవ లబ్ధిదారులకు డబ్బులు రైతుల ఖాతాలో జమ అయిన సందర్భంగా రైతులకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ముప్పా శ్రీనివాస్ మాట్లాడుతూ రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని,రైతే రాజు గా వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని నాయకులు పేర్కొన్నారు. ప్రతి రైతుకు సాగునీటి భద్రత కల్పించడం,డిమాండ్ ఆధారిత పంటలను ప్రోత్సహించడం మరియు అగ్రి-టెక్ (ఆధునిక సాంకేతికత) ద్వారా పెట్టుబడి ఖర్చు తగ్గించడం వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అన్నదాత సుఖీభవ, ఈ పథకం ద్వారా లబ్ధి పొందిన రైతులకు అభినందనలు తెలుపుతూ, ప్రభుత్వ చేయూతను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సాంకేతికత వినియోగం డ్రోన్ల వినియోగం సబ్సిడీపై యంత్రాల సరఫరా మరియు సూక్ష్మ సేద్యం ద్వారా



40-50% నీటిని ఆదా చేస్తూ అధిక దిగుబడులు అందించే విధంగా సూచించారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పాటి చలపతి, మాజీ జెడ్పీటీసీ గోడేటి రవికుమార్, ఎటపాక గ్రామ పంచాయతీ సర్పంచ్ కారం వెంకటేశ్వర్లు, గోసుల వీర్రాజు, సచివాలయ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని నాయకులు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# బాధితులకు అండగా మినిస్ట్రీస్ అండ



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** మండలంలోని మెర్లపాలెం గ్రామం, అరుంధతీ పేటలో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో రెండు పూరి గుడిసెలు అగ్ని ప్రమాదంలో దగ్ధం అయ్యాయి. కట్టుబట్టలతో బయటకి వచ్చిన రెండు కుటుంబాలు ఈ అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయారు. అగ్ని ప్రమాదం గురించి తెలుసుకున్న రాజమండ్రి బర్మా కాలనీకి చెందిన జె.ఎస్.ఎస్.డబ్ల్యూ. మినిస్ట్రీస్ ఫౌండర్ & ప్రెసిడెంట్ హనోక్ పుత్ర వెంటనే స్పందించి బాధితులకు అండగా ఉంటానని సొంత ఖర్చులతో ప్రమాదానికి గురైన ఇళ్లను తిరిగి నిర్మిస్తాను అని హామీ ఇచ్చి, వెంటనే వారి స్థలంలోనే గృహ నిర్మాణాలను చేపట్టి పూర్తి చేసి సోమవారం గృహప్రవేశ కార్యక్రమాన్ని పూర్తి చేసి బాధితులు అయిన ములగలేటి వెంకన్నకు మరియు కొమ్మర సుబ్బలక్ష్మి లకు అందజేశారు. అలాగే వారికి కావలసిన నిత్యావసర వస్తువులు మరియు గృహ అవసర సామాగ్రి అందించారు. ఈ కార్యక్రమంలో హనోక్ పుత్ర మాట్లాడుతూ ఇది కేవలం యేసు క్రీస్తు ప్రభువు వారి ప్రేమను బట్టి మాత్రమే చేయగలిగానని, నిన్ను వలె నీ పొరుగు వానిని ప్రేమింపవలెను అనే బైబిల్‌లోని ఆజ్ఞ నన్ను ప్రేరేపించడంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టగలిగానని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో డా. హనోక్ పుత్ర సతీమణి ఎలీజబెత్ పుత్ర, వైస్. ప్రెసిడెంట్ జాకోబ్ పుత్ర, గ్లోరి శాంత, పాస్టర్. జాకోబ్ రాజు, ప్రభు దాస్, ముత్తాబత్తుల విశాల్ ప్రేమ్, కొమ్మర మనోజ్ కుమార్, పాస్టర్ కొల్లాబత్తుల రాజా రత్నం, ములగలేటి మందులయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది పురస్కారాలతో మహిళలకు సన్మానం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** భరద్వాజ సేవా సంఘం ఆధ్వర్యంలో "ఉగాది పురస్కారాలు - 2026" పేరున వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన మహిళా శిరోమణులను ఉగాది పురస్కారంతో సన్మానించ దల్చామని సంఘ అధ్యక్షులు డాక్టర్ ఐ.వి.రావు, కార్యదర్శి ముంజులూరి విశ్వేశ్వరరావు సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరం యువ ప్రతిభావంతులను బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు చేతుల మీదుగా ఉగాది పురస్కారంతో సన్మానించిన విషయాన్ని గుర్తు చేస్తూ ఈ సంవత్సరం వివిధ రంగాల ద్వారా సమాజానికి విశేష సేవలు అందిస్తున్న మహిళలను ఎంపిక చేసి వారిని సత్కరించ దల్చామన్నారు. ఈ నెల 19 వ తేదీ గురువారం ఉగాది పండుగ రోజు ఉదయం 9:30 గం లకు దంటు కళాక్షేత్రంలో నిర్వహించబడుతుందన్నారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా జేఎన్టీయూ ప్రొఫెసర్, డా. కె.వి .జి.ఎస్ మురళీకృష్ణ పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమములో భాగంగా దేశ విదేశాలలో అనేక నాట్య ప్రదర్శనలు ఇచ్చి ఎందరో ప్రముఖుల ప్రశంసలు అందుకున్న ప్రముఖ నాట్య కళాకారిణి, నాట్యమయూరి, నాట్య శిరోమణి బిరుదాంకితురాలు అయిన నదియాచే శాస్త్రీయ నృత్య ప్రదర్శనను ఏర్పాటు చెయ్యడం జరిగిందని అన్నారు. కాకినాడ నగర ప్రజలు మరియు భరద్వాజ సేవా సంఘం సభ్యులందరూ కుటుంబసభ్యులతో విచ్చేసి ఈ "ఉగాది పురస్కారాలు" కార్యక్రమాన్ని జయప్రదం చెయ్యాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

## చింతూరు ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన రాష్ట్ర కాయకల్ప టీమ్



**చింతూరు, మేజర్ న్యూస్ :** చింతూరు ప్రభుత్వ ఆసుపత్రిని సోమవారం కాయకల్ప టీమ్ సందర్శించింది. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అమలు చేస్తున్న శానిటేషన్ విధానం, రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత, వార్డుల నిర్వహణ, రోగులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. అలాగే నవజాత శిశు కేంద్రం మరియు డయాలసిస్ సెంటర్‌ను సందర్శించి అక్కడ అందిస్తున్న వైద్య సేవల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, పరికరాల వినియోగం, సిబ్బంది సేవలను పరిశీలించారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు డాక్టర్లు మరియు సిబ్బంది చేస్తున్న కృషిని కాయకల్ప టీమ్ సభ్యులు అభినందించారు. ఆసుపత్రి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సింగంపల్లి అరుణకుమారి, స్టేట్ పిపిఎం కోఆర్డినేటర్ (టిబి), సబితా సుధా లలిత, డిస్ట్రిక్ట్ క్వాలిటీ అస్యూరెన్స్ కన్సల్టెంట్, సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి, మరియు ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సూర్య
www.suryaa.com

మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678

అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ,
ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు,
మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా రైతులకు కరపత్రాలు అందజేత



**చింతూరు, మేజర్ న్యూస్ :** ఆత్మీయులైన అన్నదాతలకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రైతన్న మీకోసం అనే కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని నిమ్మలగూడెం గ్రామంలో ఏర్పాటుచేసిన స్థానిక రైతుల అవగాహన సదస్సులో టిడిపి మండల అధ్యక్షులు మొహమ్మద్ జమాల్ ఖాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్రంలోని ప్రతి కర్షకుడి కష్టానికి ఫలితంగా వారితో కలిసి నడవాలని రాష్ట్ర ఆర్థిక సౌధానికి మూలస్తంభం వ్యవసాయ రంగమేనని వ్యవసాయం ఉద్యాన పశుసంవర్ధక మత్స్య రంగాలు రాష్ట్ర జీఎస్ డీపీలో 35 శాతం వరకు వాటా అందిస్తున్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపిస్తుందని అన్నారు.

రాష్ట్రంలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించే దిశగా అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులు ప్రభుత్వం పూర్తి చేస్తుందని సమర్థ నీటి నిర్వహణలో అన్ని ప్రాజెక్టులు నింపుతారని సమాజంలో నేడు మారుతున్న ఆహార అలవాట్లకు అనుగుణంగా అన్నదాతలు సాగు పద్ధతులు మార్చుకోవాలని పంట మార్పిడి పాటిస్తూ చిరుధాన్యాలను రాగులు జొన్నలు సజ్జలు కొర్రలు వంటి వాటికి మళ్లీ ప్రజల్లో డిమాండ్ ఏర్పడిందని చిరుధాన్యాల సాగు మరింత పెంచాలని ప్రకృతిలో వచ్చే వాతావరణ మార్పులను తట్టుకునే పరిష్కారం మార్గంగా ప్రకృతి నేచర్ వ్యవసాయం పెద్ద ఎత్తున అందరూ చేపట్టాలని ఆయన ఈ సందర్భంగా రైతులకు విన్నవించారు. అనంతరం అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల వద్దకు వెళ్లి రైతన్న మీకోసం కరపత్రాలను అందజేసి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షులు ఎండి జహంగీర్, ప్రధాన కార్యదర్శి మల్లెల్లి వెంకటేశ్వర్లు, నాయకులు పి సాల్మన్ రాజు, ఓబులనేని నరసింహారావు చౌదరి, మంగ వేణి, కట్టా శంకర్, పొదిలి రామారావు, ఎస్.కే. రియాజ్ వ్యవసాయ సహాయక కార్యదర్శి శివకృష్ణ పాల్గొన్నారు.

# లక్ష్మీపురం పంచాయతీ పరిధిలో 'రైతన్న! మీ కోసం' కార్యక్రమం

**ఎటపాక, మేజర్ న్యూస్ :** పోలవరం జిల్లా ఎటపాక మండలం లక్ష్మీపురం పంచాయతీలో "రైతన్న! మీ కోసం" వారోత్సవాల కార్యక్రమం టీడీపీ మండల అధ్యక్షులు బొల్లా పుల్లయ్య,టీడీపీ మండల కార్యదర్శి కనీతి మధు ఆధ్వర్యంలో సోమవారం అత్యంత ఉత్సాహంగా ప్రారంభమైంది. కూటమి ప్రభుత్వ ప్రతిష్టాత్మక సూపర్ సిక్స్ పథకం అన్నదాత సుఖీభవ లబ్ధిదారులకు డబ్బులు రైతుల ఖాతాలో జమ అయిన సందర్భంగా రైతులకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బొల్లా పుల్లయ్య మాట్లాడుతూ రైతే రాజుగా వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని నాయకులు పేర్కొన్నారు. ప్రతి రైతుకు సాగునీటి భద్రత కల్పించడం, డిమాండ్ ఆధారిత పంటలను ప్రోత్సహించడం మరియు అగ్రి-టెక్ (ఆధునిక సాంకేతికత) ద్వారా పెట్టుబడి ఖర్చు తగ్గించడం వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అన్నదాత సుఖీభవ: ఈ పథకం ద్వారా లబ్ధి పొందిన రైతులకు అభినందనలు తెలుపుతూ, ప్రభుత్వ చేయూతను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డ్రోన్ల వినియోగం, సబ్సిడీపై యంత్రాల సరఫరా మరియు సూక్ష్మ సేద్యం ద్వారా 40-50% నీటిని ఆదా చేస్తూ అధిక



దిగుబడులు అందించే విధంగా సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు ఉండిటి రమేష్ సుక్య, సచివాలయ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని నాయకులు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# యాతం నాగబాబుకు ఉగాది పురస్కారం



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** మదర్ థెరిసా స్వచ్ఛంద సేవా సంస్థ విశాఖపట్నం వారిచే సంస్థ అధ్యకులు కె.క్రిష్ణ మూర్తి ద్వారా ఉగాది పురస్కారం నాగబాబుకు లభించింది. కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణం నకు చెందిన యాతం నాగబాబును ఆహ్వానించి క్రీడా రంగం నుండి జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో వెటరన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ పరుగు పందెం నందు మొత్తం 92 పతకాలు సాధించినందుకు ఈ సందర్భంగా మదర్ థెరిసా స్వచ్ఛంద సేవా సంస్థ వారు గౌరవగా నన్ను పిలిచి క్రీడా రత్నా అవార్డ్ మరియు ఉగాది జీవిత సాఫల్య పురస్కార అవార్డ్స్ బహుకరించారు.

# డిగ్రీ కళాశాలలో వినియోగదారుల దినోత్సవం



రంపచోడవరం, మేజర్ న్యూస్ : ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా వినియోగదారుల అవగాహన సమావేశాన్ని రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో పౌర సరఫరాలు శాఖ, ఆహార భద్రత, లీగల్ మెట్రాలజీ, ఔషధ నియంత్రణ శాఖ, గ్యాస్ కంపెనీలు, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు వినియోగదారుల హక్కులు, భద్రమైన ఉత్పత్తుల కొనుగోలు, ఆహార పదార్థాల నాణ్యత, వంటగ్యాస్ (ఎల్పిజీ) సరఫరా సమస్యలు, ఔషధాల ధరలు, తూకాలు-కొలతల నియమాలు, అలాగే ఆన్‌లైన్ షాపింగ్ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరంగా అవగాహన కల్పించారు. వినియోగదారులు వస్తువులు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, ఉత్పత్తులపై ఎమ్మార్పీ, తయారీ తేదీ, గడువు తేదీ వంటి వివరాలను పరిశీలించాలని సూచించారు. ఆన్‌లైన్ షాపింగ్ లేదా మొబైల్ యాప్‌ల ద్వారా సరుకులు కొనుగోలు చేసే సమయంలో నమ్మకమైన వెబ్‌సైట్లు లేదా అధికారిక యాప్‌లను మాత్రమే వినియోగించాలని సూచించారు. ఈ సమావేశంలో విద్యార్థులు, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు మరియు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. వినియోగదారులు తమ హక్కులను తెలుసుకొని అప్రమత్తంగా ఉంటేనే సమాజంలో పారదర్శకత మరియు న్యాయం పెరుగుతుందని అధికారులు తెలిపారు.

# ఘనంగా అధ్యయనోత్సవాలు

– పోటెత్తిన భక్తజనం





**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్:** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి కల్యాణోత్సవాలకు ముందుగా జరిగే అధ్యయనోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం రెండవ రోజు ద్రవిడ వేద పారాయణం, నీరాజనం మంత్రపుష్పం, తీర్థ గోష్టి, ప్రసాద వితరణ, సాయంత్రం గరుడవాహన సేవ, పల్లకి సేవ తదితర కార్యక్రమాలు కన్నులపండువుగా జరిగాయి. వైష్ణవ పండితులు వాహనాల ముందు ద్రవిడ వేద పారాయణం చేస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా పరిసరాలన్నీ గోవింద నామస్మరణతో ప్రతిధ్వనించాయి. స్వామివార్లకు దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావులు పట్టు వస్త్రాలు సమర్పించారు. మంగళవారం వేద పారాయణం సింహ వాహన సేవ నిర్వహించేందుకు దేవస్థానం తగు ఏర్పాటు చేసింది.

# ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి ఎంపిడిఓ బి.కె.ఎస్.ఎస్. వెంకట రామన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు ప్రజల స్వాభిమానానికి ప్రతీకగా నిలిచిన అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం చేసిన నిరాహార దీక్ష మరియు త్యాగం చరిత్రలో చిరస్మరణీయమని తెలిపారు. ఆయన త్యాగం వల్లే తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కె.రమేష్ బాబు, మండల విద్యాశాఖాధికారి పి.వి.ప్రసాదరావు, మండల పరిషత్ పరిపాలనాధికారి, వి.రామ స్వరూప్, పంచాయితీ కార్యదర్శి కె.యశ్వంత్ కుమార్, గ్రామ సచివాలయ సిబ్బంది, విద్యాశాఖ సిబ్బంది, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ సత్య దేవుని హుండీల ఆదాయం రూ.1,23,68,424లు



**అన్నవరం, మేజర్ న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో సోమవారం నాడు హుండీల ఆదాయాన్ని నిత్య కళ్యాణమండపంలో, దేవస్థానం చైర్మన్ ఐ.వి.రోహిత్ మరియు కార్య నిర్వహణ అధికారి వేంద్ర త్రినాథరావు సమక్షంలో లెక్కించారు. ఈ లెక్కింపులో బంగారం 97 గ్రాములు, సిల్వర్ 320 గ్రాములు, యూఎస్ఏ డాలర్స్ 126, సింగపూర్ డాలర్స్ 2, కతర్ రియాల్స్ 82, కువైట్ దినార్ 3, యుఏఈ దిర్హాం 120, సౌదీ సెంట్రల్ బ్యాంక్ రియల్స్ 20, ఆస్ట్రేలియా రియాల్స్ 5, మలేషియా రింగిట్ 2, కెనడా డాలర్ 5, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇరాక్ డినార్ 3000, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ లిబియా డినార్ 10, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఒమన్ రియాల్ 1, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఒమన్ బైస 500, నరోద్నా బంకా స్ర్బిజే-దినార్లు 10 మరియు రూ.1,23,68,424లు ఆదాయం వచ్చిందని దేవస్థానం అధికారులు తెలియజేశారు. ఈ లెక్కింపులో సేవకులు, దేవస్థానం సిబ్బంది, పురోహితులు, నాయి బ్రాహ్మణులు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి తీరంలో మృత్యుగుంటలు..





**- కేదార్లంకలో కొనసాగుతున్న అక్రమ తవ్వకాలు**
**- అర్థరాత్రి యంత్రాలతో మట్టి దందా**
**- ప్రమాదకరంగా మారుతున్న నదీ తీరం**
**- తవ్వకాలు ఆగకపోతే గ్రామ ఉనికికే ముప్పు**

**కపిలేశ్వరపురం, మేజర్ న్యూస్ :** ప్రకృతి సౌందర్యానికి నిలయంగా పేరుగాంచిన కేదార్లంక గోదావరి తీరం ప్రస్తుతం ప్రమాదకర పరిస్థితుల్లోకి చేరుకుంది. అటు పర్యాటకులను,ఇటు సినీ చిత్ర యూనిట్లను విశేషంగా ఆకర్షించే ఈ ప్రాంతంలో అక్రమ తవ్వకాలు విస్తృతంగా జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ప్రసిద్ధ ధనమ్మ తల్లి ఆలయ పరిసరాల్లోని గోదావరి నదీ తీరాన్ని కొంతమంది అక్రమార్కులు రాత్రి వేళల్లో యంత్రాల సహాయంతో తవ్వుతూ మట్టిని తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీనివల్ల గోదావరి తీరం బలహీనపడటమే కాకుండా, పర్యాటకులకు కూడా ప్రాణాపాయంగా మారుతోంది.

–అధికారుల నిర్లక్ష్యం.. గ్రామ ఉనికికే ముప్పు

ప్రతిరోజూ అర్థరాత్రి సమయంలో భారీ యంత్రాలతో నదీ తీరాన్ని మనిషి మునిగిపోయేంత లోతులో తవ్వి, మట్టిని తరలించి గుంతలను అలాగే వదిలేస్తున్నారు. ఈ గుంతల్లో తరువాత నీరు చేరడంతో అవి ప్రమాదకరమైన మృత్యుగుంటలుగా మారుతున్నాయి. గతంలో కూడా ఇక్కడ ఏర్పడిన గుంతల్లో నీరు నిలిచిపోవడంతో లోతు తెలియక ఇద్దరు యువకులు అందులో చిక్కుకుని మృతి చెందిన ఘటనలు చోటుచేసుకున్నాయి. అయినప్పటికీ సంబంధిత శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకోకపోవడం పట్ల స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నదీ తీరానికి అత్యంత సమీపంలోనే ఇంతటి ప్రమాదకరమైన తవ్వకాలు జరుగుతున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న వర్షాకాలంలో గోదావరి ఉధృతి పెరిగినప్పుడు నదీ తీరం కోతకు గురై కేదార్లంక గ్రామానికే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి కేదార్లంక గోదావరి తీరంలో జరుగుతున్న అక్రమ తవ్వకాలను అరికట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, పర్యాటకులు కోరుతున్నారు.

# త్యాగానికి ప్రతిరూపం శ్రీ పొట్టి శ్రీరాములు

**- యువ నాయకుడు మనోజ్ రెడ్డి**



**అనపర్తి, మేజర్ న్యూస్ :** అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగ ఫలమే ఆనాటి ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు అని, త్యాగాలకు ప్రతిరూపమే పొట్టి శ్రీరాములు అని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తనయుడు, తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు నల్లమిల్లి మనోజ్ రెడ్డి అన్నారు. పొట్టి శ్రీ రాములు 125వ జయంతి సందర్భంగా అనపర్తి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన జయంతి వేడుకల్లో మనోజ్ రెడ్డి పాల్గొని, పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మనోజ్ రెడ్డి మాట్లాడుతూ ఆనాటి ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటులో అమరజీవి పొట్టి శ్రీ రాములు వారు కృషి వారు చేసిన త్యాగం మరువలేనివని, ఆ త్యాగ ఫలమే మన రాష్ట్రమని అన్నారు. ఆనాటి త్యాగ మూర్తులు మనకు అందించిన ఫలమే ఈ రోజున మనం అనుభవిస్తున్నామని అన్నారు. 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి వారి ప్రాణాలను తెలుగు ప్రజల కోసం, తెలుగు నేల కోసం, తెలుగు తల్లి కోసం త్యాగం చేశారని అన్నారు. నేటి యువత ఆయన ఆశయాలను, ఆయన సిద్ధాంతాలను అనుసరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈస్టర్న్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ సూర్య కుమారి, ఎంపీడీవో రామకృష్ణారెడ్డి, ఎమ్మార్వో అనిల్ కుమార్ ఇతర నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## 138 పరీక్షా కేంద్రాల్లో ప్రశాంతంగా ప్రారంభమైన పదవ తరగతి వార్షిక పరీక్షలు

**- 24,166 మంది విద్యార్థులు హాజరు**
**- కలెక్టర్ కీర్తి చేకూరి**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** సోమవారం ఉదయం స్థానిక హుకుంపేట జెడ్పీ హై స్కూల్‌లో నిర్వహిస్తున్న పదవ తరగతి వార్షిక పరీక్షలను జిల్లా కలెక్టర్ కలెక్టర్ కీర్తి చేకూరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షా నిర్వహణ తీరును పరిశీలిస్తూ తరగతి గదుల్లో మౌలిక సదుపాయాలు, పాఠశాల ఆవరణ పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ, విద్యార్థులకు ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఏర్పాట్ల పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్, ప్రతి తరగతి గదిలో సరైన వెలుతురు మరియు గాలి ప్రసరణ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవి దృష్ట్యా విద్యార్థులకు శుద్ధమైన త్రాగునీరు అందుబాటులో ఉంచడంతో పాటు, వైద్య శిబిరాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు మరియు అత్యవసర మందులు సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరుగు తున్నాయని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. జిల్లాలో మార్చి 16న నిర్వహించిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు (తెలుగు పేపర్ జనరల్ మరియు కాంపోజిట్) సజావుగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 138 పరీక్షా కేంద్రాల్లో 24,424 మంది విద్యార్థులకు గాను 24,166 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల తనిఖీలలో భాగంగా జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మెజిస్ట్రేట్ హుకుంపేట జెడ్పీ హై స్కూల్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేయగా, జిల్లా స్థాయి పరిశీలనాధికారులు 7 కేంద్రాలు, జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి 4 కేంద్రాలు, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్లు సంయుక్తంగా 8 కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్లు 69 కేంద్రాలను తనిఖీ చేశారు. తొలి రోజున మొత్తం 88 పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు.పదవ తరగతి రెగ్యులర్ పరీక్షలు 138 కేంద్రాల్లోను, [illegible] పరీక్షలు 26 కేంద్రాల్లోను ప్రశాంతంగా జరిగాయని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె. వాసుదేవరావు తెలిపారు.

## పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది

**- ఎమ్మెల్యే రాజప్ప**



పెద్దాపురం, మేజర్ న్యూస్ : ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం స్వర్గీయ పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని ఎమ్మెల్యే రాజప్ప అన్నారు. సోమవారం పెద్దాపురం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణ ఆధ్వర్యంలో స్వర్గీయ పొట్టి శ్రీరాములు 125 జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప పాల్గొని, పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడుతూ తెలుగు మాట్లాడేవారి కోసం భాషా ప్రయుక్త రాష్ట్రాల విభజనకు అమరణ నిరాహార దీక్ష చేసి వారి ప్రాణాన్ని తెలుగు ప్రజల భవిష్యత్ కోసం త్యాగం చేశారని, 58 రోజులు అమరణ నిరాహార దీక్ష చేసి అమరులయ్యారని, ఆయన త్యాగం మరువలేనిదని, 58 రోజులు దీక్ష చేసినందుకు 58 అడుగుల విగ్రహం అమరావతిలో నెలకొల్పి ఆయనకు ఘనంగా నివాళులు అర్పించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం ఆర్డీఓ ఎన్.శ్రీధర్, కాకినాడ జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు నిమ్మకాలయ రంగనాగ్, సామర్లకోట ఎంపిడిఓ ఎన్.ఉమ మహేశ్వరి, కూటమి నాయకులు నూనె రామారావు, సర్పంచ్‌లు సైనం బుల్లెమ్మ, తోట రామకృష్ణ, సామర్లకోట టిడిపి అధ్యక్షులు తోటకూర శ్రీనివాస్, అడబాల కుమారస్వామి, డిప్యూటి ఎంపిడిఓ జి.వి.శేఖరరెడ్డి, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పెద్దనాపల్లి గ్రామంలో రైతన్న - మీకోసం వారోత్సవాలు..



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** పెద్దనపల్లి గ్రామంలో వ్యవసాయశాఖ అధికారి అప్పసాని వెంకట రాజేష్ ఆధ్వర్యంలో చేపట్టినరైతన్న – మీకోసంవారోత్సవాలను ఏలేశ్వరం మండల పరిషత్ అధ్యక్షులు గొల్లపల్లి బుజ్జి సోమవారం లాంచనంగా ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ సూచనల మేరకు గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలను పంపిణి చేశారు.ఈ సందర్భంగా ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల ప్రభుత్వం అన్నారు. అన్నదాతలకు అండగా, రైతన్న శ్రేయస్సు కోసం ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ఏలేశ్వరం మండలంలో రైతులకు ఎప్పుడు అందుబాటులో ఉంటానని తెలిపారు, ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ సిబ్బంది ఎన్ డి ఏ పార్టీ శ్రేణులు పాల్కొనారు.

## ప్రశాంతంగా పది పరీక్షలు



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ఆత్రేయపురం ర్యాలీ పేరవరం కేంద్రాల్లో పది పరీక్షలు ప్రశాం తంగా జరిగాయి. ఎటువ ంటి అవాంఛనీయ సంఘ టనలు చోటు చేసుకోకు ండా ఉండేందుకు ఆయా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంచారు. మొత్తం 609 మందికి నూరు శాతం మంది పరీక్షలు హాజరయ్యారు. ఆయా పరీక్షా కేంద్రాలను ఎంఈఓ పి.వి.ప్రసాద్ రావు పరిశీలించారు.

# జిల్లాలో నిలిచిపోయిన రహదారి పనులను తక్షణమే పూర్తి చేయాలి

– గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు
లోతా రామారావు డిమాండ్



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** పోలవరం జిల్లాలో( ఏజెన్సీలో) నిలిచిపోయిన రహదారి పనులు తక్షణమే పూర్తి చేయాలని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు డిమాండ్ చేశారు. గిరిజన గ్రామాల్లో సరైన రహదారి సౌకర్యం లేక ఆదివాసీలు పడుతున్న అవస్థలపై ఆదివాసీ గిరిజన సంఘం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా, నేటికీ అనేక గ్రామాలు కనీస రవాణా సౌకర్యాలకు నోచుకోక పోవడం ప్రభుత్వాల వైఫల్యానికి నిదర్శనమని రామారావు విమర్శించారు. రంపచోడవరం నియోజకవర్గ పరిధిలో నిధుల కొరతతో లేదా ఇతర సాంకేతిక కారణాలతో అసంపూర్తిగా నిలిచిపోయిన రోడ్డు పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించి పూర్తి చేయాలనీ, అటవీ అనుమతుల పేరుతో ఏళ్ల తరబడి రోడ్ల నిర్మాణాన్ని అడ్డుకోవడం సరికాదు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపి, ఉన్నతాధికారులు సమన్వయం చేసుకొని అనుమతులు మంజూరు చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. కొండ కోనల్లో ఉన్న మారుమూల గ్రామాలకు కూడా పక్కా రోడ్లు నిర్మించాలనీ, వర్షాకాలంలో బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్న గ్రామాలకు తక్షణమే వంతెనలు, రోడ్లు ఏర్పాటు చేయాలనీ, గిరిజన గ్రామాల అభివృద్ధి కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలనీ, రోడ్డు సౌకర్యం లేక గర్భిణీలు, రోగులను డోలీల మీద ఆసుపత్రికి తీసుకెళ్లాల్సిన దుస్థితి నేటికీ కొనసాగుతోంది. అటవీ నిబంధనలు గిరిజనుల జీవించే హక్కును కాలరాయకూడదుని ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నియోజకవర్గంలోని గిరిజన ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి తక్షణ చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

# రికార్డులు లేకుండా నడుపుతున్న బైక్ సీజ్

– రూ.5035 జరిమానా




**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** వాహన రికార్డులు వెంట పెట్టుకోకుండా వాయు వేగంతో నడుపుతున్న వాహనాన్ని సీజ్ చేసిరూ 5035 జరిమానా విధించినట్లు స్థానిక ఎస్సై శివకుమార్ తెలిపారు. ఆదివారం సాయంత్రం జాతీయ రహదారిపై స్టేషన్ పరిధిలోని కింద్ర జంక్షన్లో ఎస్సై శివకుమార్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక వ్యక్తి సరైన ధ్రువ పత్రాలు లేకుండా అతివేగంగా బైక్‌ను నడుపుతుండగా, సదరు బైక్‌ను సీజ్ చేసి, బైక్‌పై 5,035/- ఫైన్ వేయడం జరిగింది. సోమవారం వాహనదారుడు సరైన ధ్రువ పత్రాలు తో, బైక్‌కు వేసిన జరిమానా చెల్లించి పోలీస్ స్టేషన్‌కి రావడంతో అతని బైక్ ను వాహనదారునికి అప్పగించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై శివకుమార్ మాట్లాడుతూ వాహనదారులు అందరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, బైక్ నడిపే వాహనదారులు హెల్మెట్‌ను, కారు నడిపే వాహన దారులు సీటు బెల్ట్ ఖచ్చితంగా ధరించాలని సూచించారు. మైనర్ లకు వాహనాలు ఇస్తే వాహనాలు సీజ్ చేయడంతో పాటు మోటార్ వెహికల్ చట్టం ప్రకారం జరిమానా విధించడం జరుగుతుందని హెచ్చరించారు. వాహనాలు నడిపే ప్రతీ వ్యక్తి లైసెన్సులు కలిగి ఉండాలని, వాహనాలకు ఇన్సూరెన్స్ పాలసీ ఖచ్చితంగా చేయించుకోవాలని తెలియచేశారు.

# అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు జయంతి



సామర్లకోట, మేజర్ న్యూస్ : తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన శ్రీపొట్టి శ్రీరాములు 125వ జయంతిని సామర్లకోట పట్టణంలోని మఠం సెంటర్ వద్ద పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించడం జరిగింది. స్థానిక నాయకులు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ తెలుగు భాష మాట్లాడే వారికోసం ప్రత్యేక రాష్ట్రం కావాలని 58 రోజులపాటు అమరణ నిరాహార దీక్ష చేపట్టి ఆత్మార్పణ చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములుని కొనియాడారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై పొట్టి శ్రీరాములు ఆశయాలను నెరవేర్చాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా తెలుగుదేశం ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళులు



పెరవలి, మేజర్ న్యూస్ : అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా మార్చి 16వ తేదీ సోమవారం పెరవలి మండల వ్యాప్తంగా వివిధ గ్రామాలలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెరవలి సెంటర్లో కొత్తపల్లి ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి ఆర్యవైశ్య సేవా సంఘం నాయకులు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు తన ప్రాణాలను అర్పించిన మహనీయుడు అమరజీవి, తెలుగు ప్రజల స్వాభిమానానికి ప్రతీకగా నిలిచిన ఆయన త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది అన్నారు. ఆయన చూపిన మార్గంలోనే సమాజానికి సేవ చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. రాజధాని ప్రాంతంలో నిర్మిస్తున్న 58 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహ నిర్మాణానికి స్థానిక ఆర్యవైశ్యులు విరాళాలు సేకరించి అమరజీవి ట్రస్ట్ కు పంపారు. పెరవలి మండలం ముక్కామల గ్రామంలో స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గల పొట్టి శ్రీరాములు చిత్రపటానికి గ్రామ ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సేవా సంఘం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏలేశ్వరంలో అమరజీవి 125వ జయంతి వేడుకలు



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** పట్టణంలో నగర పంచాయతీ కార్యాలయం వద్ద గల పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉభయగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం వైస్ ప్రెసిడెంట్ గొల్లపూడి త్రిమూర్తులు, ఏలేశ్వరం మండల ఆర్యవైశ్య అధ్యక్షుడు, సిహెచ్చి చైర్మన్ వాగు రాజేష్ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 125 జయంతి వేడుకలకు నాయకత్వం వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి సీనియర్ నాయకులు కౌన్సిలర్ అలమండ చలమయ్య, యువ నాయకులు బోదిరెడ్డి గోపి,మూది నారాయణస్వామి హాజరయ్యారు. ముందుగా విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రానికి చేసిన సేవలు మరుగులేనివని, 58 రోజుల అమర నిరాహార దీక్ష చేసి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని తీసుకొచ్చిన మహోన్నత వ్యక్తి అని, తెలుగుజాతి గర్వించదగ్గ వ్యక్తి అని కొనియాడారు. అలాగే కూటమి ప్రభుత్వం అమరావతిలో పొట్టి శ్రీరాములు 58 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు.పెనుగొండ ఊరు పేరును వాసవి పెనుగొండగా మార్చిన ఘనత కూటమి ప్రభుత్వానిది అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎండగుండి నాగబాబు,మామిడి లలిత, రుచి రమేష్,కోణాల వెంకటరమణ,రాయుడు చిన్న,ఆర్యవైశ్యులు వాగు గున్నంరాజు, మట్టే సుబ్బారావు,శరణ్య శ్రీను,ప్రగళ్లపాటి పెదబాబు,ఎల్లంపల్లి దత్తుడు,రాతికింద సతీష్,వి. కామేష్,ఏ శ్రీను,ఊర నానాజీ, వాగు బద్రిష్,పి.కామేష్,మణికంఠ,పి. సురేష్,వాగు రమేష్, నరసింహ, బలరాం, వినోద్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు



– పగడ్బందీగా నిర్వహించిన అధికారులు

**అనపర్తి, మేజర్ న్యూస్ :** పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. అనపర్తి మండలంలో 4 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. మండలంలోని 892 మందికి ముగ్గురు విద్యార్థులు గైర్హాజరు కాగా 889 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఎంఈఓ సత్తిరెడ్డి తెలిపారు. వీరిలో అనపర్తి బాయ్స్ హై స్కూల్ పరీక్షా కేంద్రంలో 279 మంది, గర్ల్స్ హై స్కూల్ పరీక్ష కేంద్రంలో 219 మంది, ఓల్డ్ టౌన్ జడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రంలో 155 మంది, కుతుకులూరు జడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రంలో 165 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 71 మంది బిక్కవోలు మండలం, కాపవరం గ్రామంలోని పరీక్ష కేంద్రంలో పరీక్షలకు హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఈ పరీక్షలు ఏప్రిల్ 1 వరకు కొనసాగనున్నాయి. మండల పరిధిలో ఏర్పాటు చేసిన 4 పరీక్షా కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల తనిఖీలు నిర్వహించారు. అనపర్తి ఎస్సై శ్రీను నాయక్ పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, ప్రథమ చికిత్స వంటి సదుపాయాలు కల్పించారు. మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు, ఎలక్ట్రానిక్ పరికరాలు వెంట తీసుకురాకూడదని అన్నారు. హాజరైన ప్రతి విద్యార్థిని తనిఖీ చేశారు. మొదటి రోజు ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్ పరీక్ష నిర్వహించగా విద్యార్థులు సమయానికి హాజరై పరీక్ష రాశారు. విద్యార్థులు తప్పనిసరిగా హాల్ టికెట్ తీసుకుని రావాలని అధికారులు తెలిపారు. పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి.

# రైతుల భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

**– రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ శిరీషాదేవి**



**రంపచోడవరం, మేజర్‌న్యూస్ :** రైతుల భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, లాభదాయక వ్యవసాయ పద్ధతులపై గిరిజన రైతులు దృష్టి సారించాలని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి అన్నారు. రైతన్న మీకోసం సేవలో భాగంగా రైతుల మోముల్లో చిరునవ్వే ధ్యేయంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఎమ్మెల్యే శిరీషాదేవి అన్నారు. రంపచోడవరం మండలం తామరపల్లి గ్రామంలో సోమవారం రైతన్న మీకోసం – వారోత్సవాలు కార్యక్రమం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే శిరీష దేవికు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె ప్రతీ ఇంటికి వెళ్లి రైతుల యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఇటీవల రైతులకు ప్రభుత్వం అందించిన అన్నదాత సుఖీభవ – పియం కిసాన్ సొమ్ము అందరికీ అందయా అని తెలుసుకున్నారు. బ్యాంక్ ఖాతాలో నగదు జమ కాకపోతే వెంటనే వ్యవసాయ శాఖ సిబ్బందిని, సచివాలయంలో సంప్రదించాలని సూచించారు. ఇప్పటికే అందరికీ నగదు వేసినట్లు పేర్కొన్నారు. రైతులకు సాగునీటి యాజమాన్య పద్ధతులపై వివరించారు. 90 శాతం సబ్సిడీపై బిందు సేద్యానికి ప్రభుత్వం అందిస్తుందన్నారు. రైతులు లాభదాయక వ్యవసాయ పద్ధతులపై చైతన్యం చేయాల్సిన అవసరం వ్యవసాయ శాఖపై ఉందన్నారు. 4116 గ్రామ పంచాయతీల్లో 5.24 లక్షల హెక్టార్‌లలో 11.29 లక్షల రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలను పాటిస్తున్నట్లు పేర్కొన్నారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే ఆరోగ్యకరమైన పంటలు నేటి సమాజానికి చాలా అవసరమన్నారు. కేంద్ర ప్రభుత్వం నేషనల్ మిషన్ ఆన్ న్యాచురల్ ఫార్మింగ్ పథకం ద్వారా అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయంపై విస్తృత ప్రచారం చేయాలన్నారు.

**మంచి విద్యాబోధన అందించాలి**

విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలని రంపచోడవరం ఎమ్మెల్యే రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి అన్నారు. రంపచోడవరం మండలం తామరపల్లి గ్రామంలో గిరిజన సంక్షేమ ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాల విద్యార్థులకు అందుతున్న విద్యా బోధనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంచి చదువుతో పాటు మంచి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు మంచిగా చదువుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ లోతా లక్ష్మణరావు, నియోజకవర్గం ఎస్టీ విభాగం అధ్యక్షులు పండా చెల్లన్న దొర, ప్రధాన కార్యదర్శి కోసు నాగన్న దొర, క్లస్టర్ ఇంచార్జి కారం సింహాచలం, సీతపల్లి దేవస్థానం చైర్మన్ కుంజం బాపన్న దొర, సభ్యులు సిద్ద వెంకన్న దొర, బొగ్గుల లక్ష్మి, కొమరం నాగన్నదొర, ఈక నాగన్న దొర, తెల్లం భద్రం, బొగ్గుల లక్ష్మి, నర్సిరెడ్డి, కూర శ్రీరాములు, కారం శాంతి కుమారి, గణపతి, పీసా కమిటి ప్రతినిధులు కుంజం కొండయ్య దొర, కంగల వేమన్న దొర, మడకం వెంకన్న దొర, ఈక గోపి, శెట్టి చిన్నమ్మి, సోడే సోమన్నదొర, కుంజం సత్యనారాయణ దొర, కుంజం బాపనమ్మ, వార్డు సభ్యులు కుంజం లక్ష్మి, సోడే చిట్టిదొర, కన్నపుదొర, భద్రం దొర, ప్రకృతి వ్యవసాయం విభాగం ప్రతినిధులు డిపిఎం జిల్లా పథక నిర్వహణాధికారి రాబిన్ సుదర్శన్, ఎంటి గజేంద్ర, నాగరాజు, శాంత కుమారి, సుధ, ప్రభుత్వ శాఖల సిబ్బంది అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ శశి బిందు, అగ్రికల్చర్ అసిస్టెంట్ దూడ జేమ్స్, విఆర్ఓ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి కామరాజు, వెటర్నరీ అసిస్టెంట్ కె.నాగబాబు, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి, డిఇఓ రాజేంద్ర, ఎఇఓ హనుమంతరావు పాల్గొన్నారు.


# ప్రాధాన్యత క్రమంలో గ్యాస్ సరఫరా

**– తహశీల్దార్ సిహెచ్ వెంకటలక్ష్మీ**



పెద్దాపురం, మేజర్ న్యూస్ : పెద్దాపురం మండలంలో ఎల్‌పిజి సిలిండర్ల సరఫరా నిరంతరాయంగా కొనసాగుతుందని, అలాగే వినియోగదారుల అవసరాలకు అనుగుణ ంగా పంపిణీ చేయడంతో పాటు ప్రాధాన్యత క్రమంలో గ్యాస్ వినియోగదారులకు గ్యాస్ సిలిండర్ల సరఫరా చేయడం జరుగుతుందని, తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మీ తెలిపారు. సోమవారం ఆమె తెలుపుతూ గ్యాస్ కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మండలంలో 65,715 గ్యాస్ కనెక్షన్‌లు ఉన్నాయని, వాటిని బుక్ చేసుకున్న వినియోగదారులకు బుకింగ్ ప్రకారం సరఫరా చేయడం జరుగుతుందని, ప్రతీరోజు ఉదయం, సాయంత్రం గ్యాస్ స్టాక్‌పై నిరంతర నిఘా ఉండడంతో పాటు, ఏ రోజు ఎన్ని పంపిణీ చేశారన్న వివరాలు తహశీల్దార్ కార్యాలయానికి అందజేయడం జరుగుతుందని, పట్టణంలో గల నాలుగు గ్యాస్ ఏజెన్సీలపై రెవెన్యూ అధికారులు నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని, కావున గ్యాస్ వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సాధారణ స్థాయి కంటే బుకింగ్‌లు ఎక్కువగా నమోదు అవుతున్నాయని, మొదట నమోదు చేసుకున్నవార్కి ప్రాధాన్యత క్రమంలో సరఫరా జరుగుతాయని, అవసరానికి మించి బుకింగ్ చేయవద్దని గ్యాస్ వినియోగదారులకు తహశీల్దార్ సూచించారు.

# భాషా ప్రయుక్త రాష్ట్రాల మూలపురుషుడు అమరజీవి పొట్టి శ్రీరాములు



**– యనమల రామకృష్ణుడు, యనమల దివ్య**

**తుని,మేజర్‌న్యూస్ :** తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను పణంగా పెట్టిన మహోన్నతుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు మరియు ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య కొనియాడారు. పొట్టి శ్రీరాములు 126వ జయంతిని పురస్కరించుకుని వారు ఆయనకు ఘన నివాళులర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..భాషా ప్రయుక్త రాష్ట్రాల ఆవిర్భావానికి పొట్టి శ్రీరాములు గారే మూలపురుషుడని స్పష్టం చేశారు. 1952లో ప్రత్యేక రాష్ట్రం కోసం 58 రోజుల పాటు సాగించిన ఆమరణ నిరాహార దీక్ష తెలుగు జాతి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని వారు పేర్కొన్నారు. ఆయన చేసిన ప్రాణ త్యాగం ఫలితంగానే మద్రాసు రాష్ట్రం నుంచి ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని, తద్వారా దేశవ్యాప్తంగా భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు బలమైన పునాది పడిందని యనమల గుర్తు చేశారు. తెలుగు వారి ఉనికిని, గౌరవాన్ని కాపాడేందుకు ప్రాణాలర్పించిన ఆయన త్యాగనిరతి నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని వారు కొనియాడారు.తెలుగు ప్రజల హృదయాల్లో అమరజీవిగా నిలిచిన పొట్టి శ్రీరాములు ఆశయాలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యతని ఈ సందర్భంగా యనమల రామకృష్ణుడు మరియు యనమల దివ్య పేర్కొన్నారు.

## రూ.25,365/- శ్రీ ఆంజనేయస్వామి హుండీల ఆదాయం



**పెద్దాపురం రూరల్,మేజర్‌న్యూస్ :** పెద్దాపురం మండలం, వాలుతిమ్మాపురం గ్రామంలో వేంచేసియున్న శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం నందు దేవస్థాన కార్యనిర్వాహణాధికారి బిక్కిన వెంకటరాయ చౌదరి ఆధ్వర్యంలో హుండీల లెక్కింపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యనిర్వాహణాధికారి వెంకటరాయ చౌదరి తెలుపుతూ ది.19-3-2025 నుండి 16-3-2026 వరకు (11 నెలల 25 రోజులకు గాను) రూ.25,365/- హుండీల ద్వారా ఆదాయం సమకూరినట్లు ఇఓ తెలిపారు. ఈ హుండీల లెక్కింపు కార్యక్రమంలో కార్యనిర్వాహణాధికారి కె.వి.వి.వేణుగోపాల్ (ఇఓ గ్రూప్ టెంపుల్స్, కాజూలూరు), దేవస్థాన అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, ఆలయ సిబ్బంది బిక్కిన నాని, వ్యవసాయ మార్కెట్ కమిటి డైరెక్టర్లు సైనం సాల్మన్‌రాజు, గ్రామ నాయకులు బచ్చల రాజు, తదితరులు పాల్గొన్నారు.

## అమరజీవి.. జాతి మరువని ధన్యజీవి "పొట్టి శ్రీరాములు"

**– జయంతిలో పాల్గొన్న తహశీల్దార్ వెంకటలక్ష్మీ**



**పెద్దాపురం రూరల్, మేజర్‌న్యూస్ :** ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం స్వర్గియ పొట్టి శ్రీరాములు తన ప్రాణాన్ని సైతం త్యాగం చేసి, ఆంధ్ర రాష్ట్రం సాధించారని తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మీ పేర్కొన్నారు. సోమవారం పెద్దాపురం తహశీల్దార్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు 125 జయంతి కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ అమరజీవి జాతి మరువని ధన్యజీవి పొట్టి శ్రీరాములు అని పేర్కొని తెలుపుతూ పొట్టి శ్రీరాములు త్యాగనిరతిని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి తహశీల్దార్లు ప్రసాద్, లక్ష్మీ కుమారి, సిబ్బంది రమణ, ఆర్ఐ చంద్రశేఖర్, సర్వేయర్ దేవుడు, వీఆర్వోలు, సిబ్బంది రాజ్యలక్ష్మీ, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు. దీనికి ముందుగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## రాజవొమ్మంగిలో ఐదు రోజుల పాటు శ్రీశ్రీశ్రీ నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గానికి చెందిన రాజవొమ్మంగిలో వందేళ్ళ చరిత్ర కలిగిన శ్రీశ్రీశ్రీ నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు మంగళవారం నుండి శనివారం వరకు నిర్వహించనున్నట్లు స్థానిక సర్పంచ్ గొల్లపూడి రమణి, సోదరులు గొల్లపూడి పెద్దిరాజు తెలిపారు. 17న మధ్యాహ్నం రెండు గంటలకు అమ్మవారికి బోనాలు, రాత్రికి శక్తి వేషాలు, తప్పిటి గుళ్ళు, తీన్మార్ బ్యాండ్, గరగనత్యాలు, డాన్స్ బేబీ డాన్స్ స్టేజ్ ప్రోగ్రామ్ అలానే 18న ఈ ప్రోగ్రాం తో పాటు చైనా కోబ్రా డాన్స్,19న డాన్స్ బేబీ డాన్స్, కోలాటం తప్పటిగుళ్ళు, స్టేజ్ ప్రోగ్రామ్, 20 21న స్టేజ్ ప్రోగ్రాలు నిర్వహించనున్నట్లు పెద్దిరాజు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. జాతర మహోత్సవానికి ప్రత్యేక ఆకర్షణగా చిన్న పిల్లలకు జాయింట్ వీల్స్,డ్రాగన్, డిస్కో కొలంబస్, ఎయిర్ బౌన్సర్లు పెట్టడం జరిగిందన్నారు. అమ్మవారి జాతర కొరకు స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీష భాస్కర్ దంపతులు రూ రెండు లక్షల 50 వేలు విరాళం ఇవ్వడం జరిగిందని ఈ సందర్భంగా వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ మేరకు మండలానికి చెందిన ప్రజలు ఎక్కడున్నా బంధుమిత్రులతో సహా విచ్చేసి శ్రీ శ్రీ శ్రీ నూకలమ్మ అమ్మవారి జాతర మహోత్సవంలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు విజ్ఞప్తి చేశారు.

# అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళులు



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఆంధ్ర ప్రత్యేక రాష్ట్రం కోసం ఆమరణ దీక్ష చేసి ప్రాణాలర్పించిన అమర జీవి పొట్టి శ్రీరాములును తెలుగు ప్రజలు ఎన్నటికీ  గుర్తుంచుకుంటారని రంపచోడవరం ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీష దేవి అన్నారు. రంపచోడవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం ఆంధ్ర కేసరి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎమ్మెల్యే శిరీష దేవి, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ మెంబర్ గొర్లె సునీత, ఎంపీపీ బంధం శ్రీదేవి, జడ్పీటిసి సభ్యురాలు పండా వెంకటలక్ష్మి, రంపచోడవరం పంచాయతీ సర్పంచ్ మంగా బొజ్జయ్య, ఎపిఓ జనరల్ డి ఎన్ వి రమణ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీష దేవి మాట్లాడుతూ  ఆంధ్ర కేసరి పొట్టి శ్రీరాములు 1901 మార్చి 16న నెల్లూరు గ్రామంలో జన్మించారని, అదేవిధంగా 1952 డిసెంబర్ 15వ తేదీన ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం నిరాహార దీక్ష చేసి అమరులైనారన్నారు. పొట్టి శ్రీరాములుకు అమరజీవి ఆంధ్ర జాతిపిత బిరుదు అందుకున్నారన్నారు. భారతదేశానికి స్వతంత్రం కోసం క్విట్ ఇండియా ఉద్యమంలో ఉప్పు సత్యాగ్రహం మొదలగు స్వాతంత్ర ఉద్యమాలలో పాల్గొన్నారన్నారు. అదేవిధంగా జాతిపిత మహాత్మా గాంధీకి పొట్టి శ్రీరాములు ప్రియ మిత్రుడని ఆమె అన్నారు. తెలుగువారిపై తమిళుల నిరంకుశ  వైఖరిని వ్యతిరేకిస్తూ తెలుగు ప్రజలకు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కావాలని బులుసు సాంబమూర్తి ఇంటి వద్ద నిరాహార దీక్ష 58 రోజులపాటు చేయడం జరిగిందని, 1952 డిసెంబర్ 15వ తేదీన మరణించారని మరణంతో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని  ఆమె అన్నారు.

పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ మాట్లాడుతూ స్వతంత్రం వచ్చిన తర్వాత తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కావాలని నిరాహార దీక్ష చేసి అమరులైన  పొట్టి శ్రీరాములును తెలుగు ప్రజలందరూ గుర్తుపెట్టుకున్నారన్నారు. ఆంధ్ర కేసరి పొట్టి శ్రీరాములు 1901వ సంవత్సరం మార్చి 16న నెల్లూరు గ్రామంలో జన్మించారన్నారు. 1952 డిసెంబర్ 15వ తేదీన  తెలుగు ప్రజల కోసం, తెలుగువారి ఆత్మగౌరవం కోసం సుమారు రెండు నెలల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేయడం జరిగిందన్నారు. పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష ఫలితమే ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ ఏర్పాటయిందన్నారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ నెంబర్ గొర్లె సునీత మాట్లాడారు. మన గ్రామాలు, మండలాలు, జిల్లా, రాష్ట్రం, దేశాన్ని అభివృద్ధి చేసుకునే బాధ్యత ప్రతి భారతీయుడుపై ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీపీ బంధం శ్రీదేవి, జడ్పిటిసి సభ్యురాలు పండా.వెంకటలక్ష్మి, సర్పంచ్ మంగ బొజ్జయ్య, ఏఎంసీ చైర్మన్ లోత లక్ష్మణ్ పొట్టి శ్రీరాములు ఆశయాలపై మాట్లాడారు. వివిధ కార్యాలయాలకు సంబంధించిన అధికారులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అదేవిధంగా అమరావతి నుండి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి  ప్రసంగం, డిప్యూటీ ముఖ్యమంత్రి ప్రసంగం ప్రోగ్రాం ద్వారా ప్రజలకు వినిపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డి ఎన్ వి రమణ, తాసిల్దార్ పి. బాలాజీ, ఎంపీడీవో ప్రసాద్, ఐటీడీఏ పరిపాలనా అధికారి ఎర్రంశెట్టి రాజు, డిప్యూటీ ఎంపీడీవో హరిబాబు, ఏపీవో బి.సత్యనారాయణ, ఏఎస్ఓ విజయ భాస్కర్, స్థానిక నాయకులు అడబాల బాపిరాజు, పండ చెల్లన్న దొర, గణపతి, మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ సిహెచ్.నిర్మల, వీఆర్వోలు శివకుమార్, ఏ చిన్న రాజు, సూపర్వైజర్ జి.కుసుమ పాల్గొన్నారు.

# ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

**రావులపాలెం, మేజర్ న్యూస్ :** రంజాన్ మాసంలో ముస్లింలు ఇచ్చే ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. రావులపాలెంలోని స్థానిక సోమసుందరరెడ్డి నగర్ కొత్త కాలనీలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు షేక్ వలీ బాబా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత ప్రత్యేక ప్రార్థనలో పాల్గొని, ముస్లిం సోదరులకు రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ శాంతి, సహనం, సోదర భావానికి రంజాన్ ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి, రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు కర్రి నాగిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐక్య కాపునాడు ట్రెజరర్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కాపు సంఘం అధ్యక్షులు, ప్రముఖ వ్యాపారవేత్త, జాతీయ సేవా పురస్కార్ అవార్డు గ్రహీత డాక్టర్ చల్లా ప్రభాకర్ రావు, జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు, అముడా మాజీ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్ రాజు, కొత్తపేట



ఎంపీపీ మార్గన గంగాధరరావు, ఉపసర్పంచ్ మునిరెడ్డి, శ్రీధర్, పంచాయితీ బోర్డు మెంబర్లు ఎలుగుబంటి బ్బూరయ్య, ఎరుకొండ గణేష్, శ్రీ భట్టి విక్రమార్కేశ్వర స్వామివారి దేవస్థానం మాజీ చైర్మెన్ శ్రీపతి వీర్రాజు, ప్రముఖ వ్యాపారవేత్త వెత్సా శ్రీనివాసు, రావూరి శివ, కోలా నాని, చిన్నం చిన్న, గుబ్బల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కేజీ బేసిన్‌లో ముమ్మరంగా చమురు అన్వేషణ

**– 2,594 కిలోమీటర్ల మేర సర్వే పూర్తి**



**న్యూఢిల్లీ / కాకినాడ, మేజర్ న్యూస్ :** దేశీయంగా ఇంధన ఉత్పత్తిని పెంచే లక్ష్యంతో కృష్ణా-గోదావరి బేసిన్‌లో అన్వేషణ కార్యకలాపాలు వేగవంతంగా కొనసాగుతున్నాయి. రాజ్యసభలో ఎంపీ  సానా సతీష్ బాబు  అడిగిన ప్రశ్నకు సమాధానంగా కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేష్ గోపీ  ఈ వివరాలను వెల్లడించారు. 'మిషన్ అన్వేషణ' పథకం కింద కేజీ బేసిన్ పరిధిలో ఇప్పటివరకు 2,594.10 లైన్ కిలోమీటర్ల మేర 2డీ సీస్మిక్ సర్వేలు విజయవంతంగా పూర్తయ్యాయని ఆయన పేర్కొన్నారు.

దేశవ్యాప్తంగా వివిధ బేసిన్లలో 2026 ఫిబ్రవరి నాటికి మొత్తం 13,262.52 ఎల్.కె.ఎం. మేర సర్వేలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకోగా, అందులో ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతంలోని కేజీ బేసిన్ వాటా అత్యంత కీలకంగా ఉంది. ప్రస్తుతం ఈ అన్వేషణలో అత్యాధునిక సాంకేతికతను ఉపయోగిస్తున్నామని, అయితే ప్రస్తుతానికి 3డీ సీస్మిక్ సర్వేలు చేపట్టే ఆలోచన లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. కేవలం ప్రాథమిక అన్వేషణ దశలో భాగంగా 2డీ సర్వేల ద్వారా నిక్షేపాలను గుర్తిస్తున్నట్లు మంత్రి వివరించారు.

ఈ అన్వేషణ కార్యకలాపాలు విస్తృతం కావడం వల్ల భవిష్యత్తులో ఈ ప్రాంతానికి భారీగా పెట్టుబడులు తరలివచ్చే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. దీనివల్ల స్థానికంగా మౌలిక వసతులు మెరుగుపడటమే కాకుండా, ఉపాధి అవకాశాలు కూడా గణనీయంగా పెరుగుతాయని మంత్రి సభకు తెలిపారు. చమురు మరియు సహజ వాయువు రంగంలో స్వయం సమృద్ధి సాధించే దిశగా కేజీ బేసిన్ ఒక కీలక కేంద్రంగా మారనుందని కేంద్రం వెల్లడించింది.

## ఘనంగా అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి



చింతూరు, మేజర్ న్యూస్ : తెలుగు ప్రజల కోసం ప్రత్యేక రాష్ట్రాన్ని కాంక్షిస్తూ పొట్టి శ్రీరాములు చేసిన 58 రోజుల అమరణ నిరాహార దీక్షకు నివాళిగా సోమవారం మొహమ్మద్ జమాల్ ఖాన్ టిడిపి మండల అధ్యక్షులు వారి ప్రాంగణంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1952 డిసెంబర్ 15వ తేదీ అర్ధరాత్రి 11 గంటల 22 నిమిషాల సమయంలో 58 రోజుల కఠోర ఉపవాస దీక్ష అనంతరం పొట్టి శ్రీరాములు తుదిశ్వాస విడిచారని, అప్పటికి ఆయన శరీరం పూర్తిగా సుస్కించి పోయిందని ఆకలి బాధకు తాళలేక ఆయన ఎన్నోసార్లు ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం నరకం చూశారని, ఆయన త్యాగ ఫలితమే నేడు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఏర్పడి సగర్వంగా మనమందరం తల ఎత్తుకొని తిరుగుతున్నామని మద్రాస్ రాష్ట్రంలో కలిసి ఉన్నప్పుడు అనేక రకాల ఇబ్బందులకు గురి అయ్యామని, పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితమే నేడు ఆంధ్రులుగా గర్విస్తున్నామని ఆయన ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు కొనియాడారు. లక్ష సాధనలో వెనుకంజ వేయకుండా ఆనాటి పాలకులకు ఎదిరించి రాష్ట్రాన్ని సాధించిన ఏకైక వ్యక్తి పొట్టి శ్రీరాములు అని  ప్రాణాలు సైతం తృణప్రాయంగా ధారపోసారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ టిడిపి అధ్యక్షులు మొహమ్మద్ జహంగీర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యుడు పీ.సాల్మన్ రాజు, కట్ట శంకర్, ఎండి రియాజ్, షేక్ షరీఫ్, జ్ఞాన సుందర్ బాబు పాల్గొన్నారు.

# పీజీఆర్ఎస్‌కు 498 అర్జీలు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలలో అందిన అర్జీలను ఎప్పటికప్పుడు, నాణ్యతతో పరిష్కారించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు.సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జిల్లా స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ షణ్మోహన్..జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, డీఆర్వో డా. టి.తిప్పే నాయక్, సీపీవో పీ.త్రినాథ్, డీఎంహెచ్ఓ డా.జె.నరసింహ నాయక్, డీఎల్పీవో పి.వాసుదేవరావు తదితర అధికారులతో కలిసి హాజరై, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు, అర్జీలు స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం, సమగ్రమైన విచారాణ చేపట్టి తగిన పరిష్కారం అందించాలని ఆయా శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. బియ్యం కార్డు మంజూరు, కార్డులలోని పేర్లు మార్పులు చేర్పులు, పింఛన్లు,  ఉద్యోగ ఉపాధి అవకాశాలు, మురికి కాలువలపై ఆక్రమణలు తొలగింపు, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుద్ధ్యం వంటి అంశాలపై మొత్తం 498 అర్జీలు అందాయి.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నందన్నారు. ప్రజా సమస్యలపై పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అందిన అర్జీలను నాణ్యతతో సకాలంలో పరిష్కరించాలన్నారు. వివిధ శాఖలో నమోదైన అర్జీలను సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి ఆ సమస్య మరల పునరావృతం కాకుండా అర్జీదారులకు సంతృప్తికరమైన పరిష్కారాలు చూపాలని జిల్లా కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. పరిష్కరించిన అర్జీల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులకు సూచించారు.కార్యక్రమలలో అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ప్రగతికి పది పరీక్షలు కీలకం

- పారదర్శకంగా పరీక్షలను నిర్వహించాలి
- విద్యార్థులు ఒత్తిళ్లకు లోనవకూడదు
- కలెక్టర్ మహేష్ కుమార్



**కొత్తపేట, మేజర్ న్యూస్ :** విద్యార్థుల విద్యా ప్రగతికి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు అత్యంత కీలకమైనవని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు.సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నందు పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ తీరును కల్పించిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పరీక్షలను అత్యంత పారదర్శకంగా,పకడ్బందీగా నిర్వహిం చాలని ఉపాధ్యాయులకు సూచించారు.పరీక్షల సమయంలో విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురవకుండా పరీక్షలు రాయాలని విద్యార్థులకు సూచించారు.విద్యార్థులు పరీక్షల పట్ల భయం వీడా లని,ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరుకావాలని కోరారు.అనవసర ఆందోళన పడకుండా ప్రశాంతంగా సమాధానాలు రాయాలని సూచించారు.పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమలులో ఉంటుందని,సీసీ టీవీ కెమెరాల నిఘా ఉంటుందని పేర్కొన్నారు.వేసవి దృష్ట్యా పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు,వెలుతురు,ఫ్యాన్లు మరియు ప్రాథమిక ఆరోగ్య చికిత్సలు అందుబాటులో ఉంచాలన్నారు.నిబంధనల ప్రకారం నిర్ణీత సమయం తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అను మతించబోరని స్పష్టం చేశారు.పరీక్షకు వెళ్లే ముందు హాల్ టికెట్ మరియు అవస రమైన స్టేషనరీని సరిచూసుకోవాలన్నారు.ప్రశ్నపత్రాన్ని అందిన వెంటనే కంగారు పడకుండా 15 నిమిషాల పాటు పూర్తిగా చదువుకోవాలన్నారు. పరీక్షల సమయంలో సరైన ఆహారం,నిద్ర తీసుకోవడం ద్వారా ఏకాగ్రత పెరుగుతుందని గుర్తుంచుకోవాలన్నారు.పరీక్షలు ప్రశాంతంగా, క్రమ బద్ధంగా నిర్వహించాలన్నారు.విద్యార్థులు ఎటువంటి ఆందోళన లేకుండా పరీక్షలు రాయగలిగే విధంగా అధికారులు,ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు.పదవ తరగతి పరీక్షలు ప్రతి విద్యార్థి జీవితంలో ఒక ముఖ్యమైన మైలు రాయి అని కాబట్టి నమ్మకంతో,ధైర్యంగా పరీక్షలు రాయాలన్నారు.కష్టపడి చదివిన వారికి ప్రతిఫలం తప్పకుండా మీకు లభిస్తుందన్నారు.ఎటువంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా సమాధానాలు రాయాలన్నా రు.పరీక్షా కేంద్రాలలో క్రమశిక్షణ,పార దర్శకత మరియు న్యాయ బద్ధత తప్పనిసరిగా ఉండాలన్నారు.విద్యార్థులు ధైర్యంగా,ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ కోరారు.నిర్ణీత సమయానికి ముందుగానే కేంద్రాలకు చేరుకోవడం,సెల్ ఫోన్‌లు లేదా ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లకుండా ఉండడం వంటి నియమాలు పాటించాలని సూచించారు.అధికారులకు ఆదేశాలుపరీక్షా కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని,ఎలాంటి అంతరాయాలు రాకుండా పరీక్షలు సజావుగా జరిగేలా అందరూ సమన్వయంతో పనిచేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాంబాబు,ప్రధానోపాధ్యా యురాలు ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

## సౌత్ జోన్ హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైన ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థి




**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల(స్వయం ప్రతిపత్తి)లో బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పి.శ్రీ మోహన్ తాతారావు సౌత్ జోన్ హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలిపారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ అంతర కళాశాలల హ్యాండ్ బాల్ పోటీలు గత నెలలో ఏలూరు సిఆర్ రెడ్డి కళాశాలలో జరిగాయి. ఈ పోటీలలో చక్కని ప్రదర్శన కనబరిచిన శ్రీ మోహన్ తాతారావు యూనివర్సిటీ బృందంలో స్థానాన్ని సాధించి, ఈనెల 17 నుండి 21వ తేదీ వరకు తమిళనాడు విట్ లో జరగనున్న సౌత్ జోన్ అంతర విశ్వవిద్యాలయ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ ఆదిత్య డిగ్రీ కళాశాలలో చదువుతోపాటు క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. సౌత్ జోన్ పోటీలలో చక్కని కనబరిచి ఆలిండియా పోటీలకు ఎంపిక కావాలని అన్నారు. హ్యాండ్ బాల్స్ సౌత్ జోన్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారా యణ, అధ్యాపకులు ఎల్ ఎస్ వరప్రసాద్, ఎన్ కిరణ్ కుమార్,టి తేజేశ్వరరావు అభినందించారు.

# వైభవంగా శ్రీ గంగమ్మ తల్లి గావు సంబరం



జగ్గంపేట, మేజర్ న్యూస్ : జగ్గంపేటలో వైభోగుల వారి ఆడపడుచు శ్రీ గంగమ్మ తల్లి గావు సంబరం వైభవంగా నిర్వహించారు. మహిళలు నైవేద్యాలతో యాదవుల సాంప్రదాయ కళలు తప్పిడి గుళ్ళు ఆట ద్వారా పలు గ్రామాల నుంచి హాజరైన కళాకారులు అత్యంత వైభవంగా అమ్మవారికి నీరాజనాలు పలికారు. జనసేన పార్టీ ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్, రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, మండల టిడిపి అధ్యక్షులు జీను మణిబాబు, నియోజవర్గ తెలుగు యువత అధ్యక్షులు దేవరపల్లి మూర్తి, నియోజవర్గ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు వేములకొండ జోగారావు సంబరానికి హాజరయ్యారు. వారికి పూలదండలతో ఆలయ కమిటీ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వైభోగుల, పెద్ద గొల్ల అప్పారావు, వైభోగుల నారాయణమూర్తి, వైభోగుల వీరపండు, వైభోగుల సత్తిబాబు, వైభోగుల గంగరాజు లు మాట్లాడుతూ జగ్గంపేట కాకినాడ రోడ్ లో కో-ఆపరేటివ్ బ్యాంక్ పక్కన పెద్ద గొల్ల వీధిలో ఉన్న వైభోగుల వారి ఆడపడుచు శ్రీ గంగమ్మ తల్లి గావు సంబరం ఆది, సోమవారాలు ఘనంగా నిర్వహిస్తామ న్నారు. గంగమ్మ తల్లి ఆశీస్సులతో సమృద్ధిగా వర్షాలు కురిసి ఈ ప్రాంత రైతులందరూ సుభిక్షంగా పంటలు పండించుకోవాలని అమ్మవారిని పూజించామన్నారు. సుమారు 7వేల మందికి మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించామని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి గంగమ్మ అమ్మ తీర్థప్రసాదాలు స్వీకరించలన్నారు . ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ వైభోగుల కొండబాబు యాదవ్, వైభోగుల శ్రీనివాస యాదవ్ జగ్గంపేట శ్రీకృష్ణ యాదవ్ సంఘం అధ్యక్షులు మొరుకుర్తి రాజు యాదవ్, వైభోగుల వీరపండు, వైభోగుల సతీష్, వైభోగుల వీరబాబు అధిక సంఖ్యలో యాదవ్ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

## పేదల ఆకలి తీర్చేందుకే అన్నా క్యాంటీన్ -ఎస్వీఎస్



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** పేదల ఆకలి తీర్చేందుకే అన్నా క్యాంటీన్లు నిర్వహిస్తున్నారని తెదేపా రాష్ట్ర కార్యదర్శి ఎస్ వి ఎస్ అప్పలరాజు అన్నారు. సోమవారం స్థానిక కాకినాడ రోడ్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్ర హం వద్ద అన్న క్యాంటీన్ నిర్వహించారు. ఈ వారం ఉచిత అన్నా క్యాంటీన్ నిర్వహణకు పట్టణ టిడిపి నేతలు ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, కొత్త కొండబాబు, పాండ్రంగి రాంబాబు, వేములకొండ జోగారావు, ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఎస్ వి ఎస్ అప్పలరాజు మాట్లాడుతూ గత వైయస్సార్ ప్రభుత్వం అన్నా క్యాంటీన్ రద్దు చేస్తే ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఐదు సంవత్సరాలుగా నిర్వహిస్తున్నమన్నారు. ఉచిత అన్నా క్యాంటీన్ కు జగ్గంపేట టౌన్ టిడిపి నాయకులు ఆర్థిక సహాయం తో 500 మందికి అన్నదానం నిర్వహించామని త్వరలోనే ప్రభుత్వ అన్న క్యాంటీన్ ప్రారంభమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో , రాయి సాయి, దాపర్తి సీతారామయ్య, రీసు రమణ, నల్ల చిరంజీవి, సందక శంకర్, వెలిశెట్టి బుజ్జి, కోడూరి రమేష్, బందారు నాని, సాంబత్తుల చంద్రశేఖర్, చెలికాని హరిగోపాల్, వానశెట్టి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# అమరజీవికి ఘన నివాళి



**అడ్డతీగల, మేజర్‌న్యూస్ :** ఏజెన్సీ మండల కేంద్రమైన అడ్డతీగలలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద సోమవారం అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతిని ఎంపీడీవో కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రప టానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం 58 రోజులపాటు ఆమరణ నిరాహారదీక్ష చేసి తన ప్రాణాలు పణంగా పెట్టిన మహా మనిషి అమరజీవి పొట్టి శ్రీరాములు అని వెల్లడించారు. సమాజంలోని బలహీన వర్గాల హక్కుల కోసం కూడా తెలుగుజాతి గర్వించదగ్గ మహానేతగా పొట్టి శ్రీరాములు త్యాగాన్ని అభివర్ణించారు తెలుగుజాతి ఉన్నంతకాలం తెలుగువారి గుండెల్లో అమరజీవి పొట్టి శ్రీరాములు బ్రతికే ఉంటారని పేర్కొన్నారు. ఆయన చేసిన త్యాగాన్ని భావితరాలకు అందించడం ప్రతి తెలుగువారి బాధ్యత అని ఎంపీడీవో కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది ఇతర అధికారులు పాల్గొన్నారు.

## శిల్పశాలను సందర్శించిన ఎమ్మెల్యే బుద్ధ



**కొత్తపేట, మేజర్ న్యూస్ :** తెలుగు భాషకు ఎంతో ప్రాచుర్యం కల్పించిన అవనిగడ్డ శాసనసభ్యులు డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్‌కు కొత్తపేటలో ఘన సత్కారం లభించింది. రాజమహేంద్రవరంలోని బొమ్మూరులో గల పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో పొట్టి శ్రీరాముల విగ్రహాన్ని ఆవిష్కరించారు. విగ్రహశిల్పి రాజకు మార్ వుడయార్ కోరిక మేరకు శిల్పశాలను సందర్శించేందుకు కొత్తపేట విచ్చేశారు.ఆ మేరకు కొత్తపేట టిడిపి శ్రేణులు శిల్పశాలకు వచ్చిన ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ ను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో కొత్తపేట ఏఎంసి వైస్ చైర్మన్ కంఠంశెట్టి శ్రీనివాసరావు,గ్రామ సర్పంచ్ బూసి జయలక్ష్మి భాస్కరరావు,ఉప సర్పంచ్ విళ్ల మారుతి ప్రసాద్,రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ మిద్దె ఆదినారాయణ,టిడిపి నాయకులు చోడపనీడి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.